సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం, 7, జూలై, 2025



వైభవం.. అక్కదేవతల ఉత్సవం

పుట్టపర్తి మండలం పెడపల్లి సమీపంలో అక్క మహాదేవతల ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. 8లో



హత్యకు ప్రేరేపించిన జల్సాలు

జల్సాలకు అలవాటుపడిన ఓ జంట డబ్బు కోసం వృద్ధురాలిని హత్య చేసింది. నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. 8లో

గరిష్టం/కనిష్టం
33.2°/21.4°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



సత్యసాయి విమానాశ్రయంలో పర్యటిస్తున్న కలెక్టర్, ఎస్పీ అధికారులు

పుట్టపర్తి టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఆదివారం కొత్తచెరువులోని శ్రీసత్యసాయి జూనియర్ కళాశాల ఆవరణలో కలెక్టర్, ఎస్పీతో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ కళాశాల పరిసర ప్రాంతాలు పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటనకు సంబంధించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం పుట్టపర్తి సమీపంలోని సత్యసాయి విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల పదో తేదీన సీఎం కొత్తచెరువులోని జిల్లా పరిషత్, జూనియర్ కళాశాల ఆవరణలో జరిగే మోగా పేరెంట్స్ సమావేశంలో పాల్గొంటారు. పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని అధికారుకు సూచించారు. పటిష్ట పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని అధికారును ఆదేశించారు. ప్రతి అధికారీ అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాణరెడ్డి, పుట్టపర్తి, ధర్మవరం ఆర్డీఓలు సువర్ణ, మహేష్, డీఆర్డీఏ పీడీ నరసయ్య, సీపీఓ విజయకుమార్, డీఈఓ క్రిష్టప్ప, పౌరసంబంధాల శాఖ జిల్లా మేనేజర్ రాజు, డీపీఓ సమత, జిల్లా రవాణాధికారి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



మధూడిలో భూతప్ప వేషధారులు

అగళి: తొలి ఏకాదశి సందర్భంగా మధూడి గ్రామంలో భూతప్ప ఉత్సవాలు నిర్వహించారు. భూతప్ప వేషధారుల సంప్రదాయక నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. భూతప్పలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రసాదాన్ని స్వీకరించారు. ఇదిలా ఉండగా జిల్లాలోని వివిధ ఆలయాల్లో ఏకాదశిని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.

వాహనదారులకు ఝలక్

- లైసెన్స్ లేదని రూ.5వేల జరిమానా

హిందూపురం: నూతన మోటార్ వాహనాల చట్టం అమలుతో వాహనదారులకు పోలీసులు ఝలక్ ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్ లేదని ఏకంగా రూ.5వేలు జరిమానా విధించారు. ఆదివారం హిందూపురం పట్టణంలోని రహమత్‌పురం సర్కిల్ వద్ద ఆదివారం టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు పాటించని వారికి, త్రిపుల్ రైడింగ్ చేస్తున్న యువకులను సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న ఎనిమిది మందికి రూ.5వేలు చొప్పున జరిమానా విధించారు. రూ.వందల్లో వేసే ఫైన్లు ఒక్కసారిగా రూ.వేలల్లో వేయడంతో వాహనదారులు బెంబేలెత్తిపోయారు.

టీబీ డ్యాంకు నూతన శోభ



విద్యుద్దీపాల వెలుగులో తుంగభద్ర డ్యాం

బొమ్మనహాళ్: తుంగభద్రమ్మ పరవళ్లు తొక్కుతుండటంతో డ్యాంకు నూతన శోభ వచ్చింది. ఆదివారం 52,815 క్యూసెక్కులు నదికి, 6 వేల క్యూసెక్కుల నీటిని వివిధ కాలువలకు పంపారు. డ్యాంలో ప్రస్తుతం 77 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంచుకుని, మిగిలిన నీటిని నదికి వదిలుతున్నారు. మరో 4 రోజుల్లో తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కి నీటిని విడుదల చేస్తామని అధికారులు ప్రకటించడంతో ఆయకట్టు రైతులు వరినారు సాగుతో పాటు మడులను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో 1,633 అడుగులకు గాను 1,625.21 అడుగులకు నీరు చేరింది. ఇన్‌ఫ్లో 52,805 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 62,027 క్యూసెక్కులుగా ఉంది. మొత్తం నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 77.180 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 1,593.19 అడుగుల వద్ద 13.900 టీఎంసీల నీటి నిల్వంతో, 25,556 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 190 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండిందని తుంగభద్ర బోర్డు అధికారులు తెలిపారు.

చంద్రబాబు.. పెద్ద మోసకారి

- బాబు మోసాలపై ఇంటింటికీ వెళ్లి తెలియజేస్తాం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేంపల్లి సతీశ్‌రెడ్డి
- పుట్టపర్తిలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ'కి హాజరు



పుట్టపర్తిలో 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' క్యూఆర్ కోడ్ విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేంపల్లి సతీశ్‌రెడ్డి, హిందూపురం పార్లమెంటు పరిశీలకులు రమేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తదితరులు

సాక్షి, పుట్టపర్తి/ పుట్టపర్తి: 'ప్రతి ఎన్నికల్లో సాధ్యం కాని హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం చంద్రబాబు నాయుడుకు అలవాటే. ప్రజలను ఓటు బ్యాంకుగా వాడుకుని గెలవడం.. ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఈసారి ప్రతిపక్ష పాత్రలో వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తోన్న క్రమంలోనే ఒకట్రెండు పథకాలను అరకొరగా ఇచ్చారు' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేంపల్లి సతీశ్‌రెడ్డి అన్నారు. పుట్టపర్తిలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నియోజకవర్గ స్థాయిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' క్యూఆర్ కోడ్ విడుదల చేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను క్యూఆర్ కోడ్ ద్వారా పరిశీలించాలని.. చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వేంపల్లి సతీశ్‌రెడ్డి అన్నారు. గడిచిన ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఒక్క హామీ అమలు చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు.. ఓ మోసగాడు.. మాయలోడు అనే విషయం ప్రజలందరికీ అర్థమైందన్నారు. వైఎస్ జగన్ హయాంలో ప్రతి నెలా ఏదో ఒక పథకం రూపంలో ప్రజల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ అయ్యేదని గుర్తు చేశారు. పేదలకు చేదోడు – వాదోడుగా వైఎస్ జగన్ నిలిచారని, నేడు చంద్రబాబు కేవలం తన కార్యకర్తలకు మాత్రమే సంపద సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక కేంద్రంగా మాత్రమే తనకు ఇదివరకు పుట్టపర్తి తెలుసన్నారు. అయితే చంద్రబాబు ప్రభుత్వంలో పంటలు దున్నేయడం, చెట్లను నరికేయడం వంటి సంప్రదాయాలను ఇక్కడ చూడాల్సి రావటం దౌర్భాగ్యమన్నారు.

జనాలొస్తారనే బాధ..

వైఎస్ జగన్ ఇటీవలి కాలంలో జిల్లాకు రెండుసార్లు వచ్చారని, జన ప్రభంజనం చూశామని సతీశ్‌రెడ్డి అన్నారు. జగన్ వస్తే భారీ సంఖ్యలో జనాలు వస్తారని, ప్రభుత్వ వైఫల్యాల గురించి చర్చిస్తారనే భయంతో చంద్రబాబు ప్రభుత్వం హెలికాప్టర్ అనుమతులు ఇవ్వకుండా అడ్డుకుంటోందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుయుక్తులు పన్నినా.. అరచేతిని అడ్డు పెట్టుకుని సూర్య కిరణాలను ఆపలేమన్న రీతిలో వైఎస్ జగన్ పర్యటనలను అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

పోల్చుకోవడానికి సిగ్గుండాలి..

జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాదిరి తాను కూడా పేద కుటుంబం నుంచి వచ్చానని చంద్రబాబు చెబుతుంటారని, ఎవరితో పోల్చుకోవాలనే విషయంలో కనీస ఇంగిత జ్ఞానం, సిగ్గు ఉండాలని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంటు పరిశీలకుడు రమేశ్‌రెడ్డి అన్నారు. 'గాంధీజీ వారసులు ఎవరో మనకు పెద్దగా తెలియదు.. అంబేడ్కర్ ఆశయాలు తప్ప వారసులు కనిపించరు.. కానీ చంద్రబాబు తన కుమారుడిని రాజకీయంగా తెచ్చి మంత్రిని చేశాడు. మనవడి పేరు మీద రూ.కోట్ల ఆస్తులు ఉన్నాయి' అని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్‌తో సహా వందకు పైగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఇంటింటికీ తిరిగి హామీలు.. వంచనల గురించి ప్రజలకు వివరిస్తామన్నారు. గత ప్రభుత్వానికి.. ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించాలని తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు మాజీ మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, రాష్ట్ర, జిల్లా పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వలాభం కోసమే బాబు పాలన

చంద్రబాబు పాలన స్వలాభం కోసమేనని మాజీ ఎమ్మెల్యే, పుట్టపర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. టీడీపీ కార్యకర్తల బాగు కోసమే పథకాలు తెచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేయకుంటే ఉచిత గ్యాస్, తల్లికి వందనం కూడా వచ్చేవి కాదన్నారు. తల్లికి వందనం గురించి అడిగితే.. అమ్మ ఒడి వచ్చిందని చెబుతున్నారని, దీన్నిబట్టి తమ నాయకుడి పథకాలకు పేరు మార్చినా.. ప్రజల్లో చెరగని ముద్ర అలాగే ఉందని అన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరకు ఏమీ తెలీదని, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ముందు ఉంటే.. సినిమాల్లో హీరోలకు డూప్‌లా ఆమె వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను వంచించిన చంద్రబాబు.. రెడ్‌బుక్‌ను అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీ నేతలు, మద్దతుదారులపై అక్రమ కేసులు, ఆస్తుల ధ్వంసానికి పాల్పడుతున్నారని విమర్శించారు. కూటమి పార్టీల నాయకులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఎదుర్కొంటామన్నారు. తమ కార్యకర్తలకు అండగా ఉంటామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో శరవేగంగా అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ హయాంలో పుట్టపర్తిని జిల్లా చేయటంతో పాటు వేల సంఖ్యలో జగనన్న ఇళ్లు కట్టించామని, రెండు జాతీయ రహదారులు, ఒక గ్రీన్‌ఫీల్డు హైవే పనులు చేపట్టామని, రూ.864 కోట్లతో నియోజకవర్గంలో 193 చెరువులు నింపే పనులకు శ్రీకారం చుట్టామని శ్రీధర్‌రెడ్డి గుర్తు చేశారు. వీటన్నింటిని ప్రస్తుత ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పూర్తి చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సూచించారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

పరిశ్రమల జాడేదీ..?

- ఏడాది ముగిసినా చిన్న పరిశ్రమకూ దిక్కులేదు
- లక్షల్లో ఉద్యోగాలని ఒక్కటీ ఇవ్వలేదు
- ఎంఎస్ఎంఈలు పెట్టడానికీ మొగ్గు చూపని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు
- రాప్తాడులో దారుణ పరిస్థితుల నేపథ్యంలో అటువైపే చూడని వైనం
- పెనుకొండ, హిందూపురం పట్టణాల్లోనూ ఇంతే...
- ఉద్యోగాలు లేక, నిరుద్యోగ భృతీ అందక అల్లాడిపోతున్న నిరుద్యోగులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏడాదిగా విచిత్ర పరిస్థితి నెలకొంది. 'మిమ్మల్ని లక్షాధికారులను చేస్తాం, ఇంటింటికీ ఉద్యోగమిస్తాం, లేకుంటే నిరుద్యోగ భృతి అందిస్తాం' అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన టీడీపీ నేతల నోట ఆ మాటే నేడు రావడం లేదు. ఆ మాటలు ఇప్పుడు వారికి కొరగానివిగా తయారయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా రాప్తాడు, పెనుకొండ, హిందూపురం ప్రాంతాలు చిన్న, సూక్ష్మ, భారీ పరిశ్రమలకు అనుకూలం. కూటమి ప్రభుత్వం వచ్చాక మూడు ప్రాంతాల్లోనూ ఇప్పటివరకూ ఒక్క కొత్త పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదు. ఎంఎస్ఎంఈల పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది.



అరాచకాలతో రాంరాం..

జిల్లాలో రాప్తాడు నియోజకవర్గం పరిశ్రమల ఏర్పాటుకు బాగా అనుకూలమని చెబుతారు. నియోజక వర్గం గుండా జాతీయ రహదారి వెళ్తుండడం, బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి వేగంగా చేరుకునే అవకాశం తదితర సానుకూలతలున్నా హత్యలు, భూకబ్జాలు, ఆక్రమణలు, రౌడీయిజం, దొంగతనాలు వెరసి చిన్న పారిశ్రామికవేత్తలు కూడా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం లేదు. శాంతిభద్రతలు అదుపుతప్పడంతో పారిశ్రామికవేత్తలు ఇక్కడకు రావడానికి వెనకాడుతున్నారు. గడిచిన ఏడాదిలో ఒక్కటంటే ఒక్క పరిశ్రమ కూడా వచ్చిన పాపాన పోలేదు. 'కొత్త పారిశ్రామిక పాలసీ తెచ్చాం, పెట్టుబడులు పెట్టండి' అంటూ అధికారులు ఎంత బతిమాలినా 'మాకొద్దు బాబూ' అంటూ ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. ఈ క్రమంలో కొత్త ఉద్యోగాలు రాకపోవడంతో పాటు ఉన్న ఉద్యోగాలకు కూడా గండం ఏర్పడింది.

2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎంఎస్ఎంఈల పరిస్థితి ఇలా		
కేటగిరీ ఏజెన్సీ	పరిశ్రమల దరఖాస్తులు	సబ్సిడీ రుణం
డీఐసీ	71	రూ.2.01 కోట్లు
కేవీఐబీ	56	రూ.1.60 కోట్లు
కేవీఐసీ	43	రూ.1.17 కోట్లు
మొత్తం	170	రూ.4.78 కోట్లు

2019-2024లో ఉమ్మడి జిల్లాలో పరిశ్రమల పరిస్థితి	
ఎంఎస్ఎంఈలు	43,491
పెట్టుబడులు వచ్చినది	రూ.1,996 కోట్లు
ఉద్యోగాల కల్పన	1,62,135

పెనుకొండ.. హిందూపురంలోనూ అంతే

పెనుకొండ, హిందూపురం ప్రశాంతంగా ఉండే పట్టణాలు. అలాంటిది నేడు రాజకీయ నాయకుల అండతో టీడీపీ కార్యకర్తలు చెలరేగిపోతున్నారు. స్వయానా ప్రజాప్రతినిధులే ఉసిగొలిపి ఇదంతా చేయిస్తున్నారు. పెనుకొండలో ఓ రీమిక్స్‌ప్లాంట్ యాజమాన్యాన్ని స్వయానా మంత్రి బెదిరించడం ఇటీవల చర్చనీయాంశంగా మారింది. చిన్న పరిశ్రమ నెలకొల్పడానికి ఎవరైనా వచ్చినా వసూళ్లకు తెగబడుతున్నారు. హిందూపురంలో ఎమ్మెల్యే పీఏలుగా చెప్పుకుంటూ కొందరు చేస్తున్న అకృత్యాలు అన్నీ ఇన్నీ కావు. కూటమి సర్కారు వచ్చినప్పటినుంచీ అక్కడ ఒక్క కొత్త పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదు. మద్యం, జూదం తీవ్రస్థాయిలో జరుగుతుండటంతో పెట్టుబడిదారులు హిందూపురం రావడానికి మొగ్గు చూపడం లేదు. ఉద్యోగం ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామన్న ప్రభుత్వం అదీ ఇవ్వలేదు.

కనుల పండువగా ఆషాఢ ఏకాదశి



ప్రశాంతి నిలయంలో దిండి పల్లకీని ఊరేగిస్తున్న భక్తులు



'వాల్యూస్ వర్సెస్ వాల్యూస్'లోని ఒక ఘట్టం

- ఆకట్టుకున్న సత్యసాయి బాల వికాస్ చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

ప్రశాంతి నిలయం: సత్యసాయి భక్తుల నడుమ ప్రశాంతి నిలయంలో ఆషాఢ ఏకాదశి వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఆదివారం ఉదయం మహారాష్ట్ర, గోవా సత్యసాయి భక్తులు సాయిని కీర్తిస్తూ దిండి పల్లకీని ఊరేగింపుగా మహాసమాధి చెంతకు తీసుకువచ్చారు. పాండురంగడు.. సత్యసాయిల అవతార లక్ష్యం ఒక్కటేనన్న సందేశాన్నిస్తూ బాలవికాస్ చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. సనాతన భారత చరిత్రలో అనేకమంది సాధువులు మనిషిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపిన తీరును చక్కగా వివరించారు. సాయంత్రం మహారాష్ట్ర, గోవా బాలవికాస్ చిన్నారులు 'వాల్యూస్ వర్సెస్ వాల్యూస్' పేరుతో మనిషి నిత్య జీవితంలో విలువలు పాటించాల్సిన ఆవశ్యకతను, పురాణాల ఆధారంగా విలువల ప్రాముఖ్యతను వివరిస్తూ చక్కటి ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు.

నేడు పరిష్కార వేదిక

ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరిష్కార వేదిక సాగుతుందని, ప్రజలు తమ సమస్యలపై అర్జీల ద్వారా విన్నవించుకోవచ్చని సూచించారు.

1100 సేవలు వినియోగించుకోండి..

ప్రజల సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన 'మీ కోసం కాల్ సెంటర్ 1100' సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ చేతన్ పిలుపునిచ్చారు. అర్జీలకు పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదుకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికైనా 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు.

కోలాహలంగా పెద్దసరిగెత్తు



బత్తలపల్లిలో కాశీంస్వామికి పూజలు నిర్వహిస్తున్న ముజావర్లు



పానకం దుత్తలతో వెళ్తున్న ఎస్సీ కాలనీ మహిళలు

- ఖాశీంస్వామిని దర్శించుకున్న భక్తులు

బత్తలపల్లి: మండల కేంద్రం బత్తలపల్లిలో బొప్పేపల్లి ఖాశీంస్వామి మొహర్రం ఉత్సవాల్లో కీలక ఘట్టం ఆదివారం పెద్ద సరిగెత్తు కోలాహలంగా సాగింది. హిందువులు, ముస్లింలు కలసికట్టుగా పెద్దసరిగెత్తు నిర్వహించారు. ఉదయం నుంచే ముజావర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పీర్లస్వాములకు చక్కెర, పానకాలు చదివించి మొక్కులు తీర్చుకున్నారు. పీర్లను పూలు, వస్త్రాలతో అలంకరించి గుండం చుట్టూ తిప్పారు. రాత్రంతా గుండంలోకి మొద్దులను వేసి రగిలించి అలావు తొక్కారు. వివిధ వేషధారణలతో ఉన్న వ్యక్తులు వరస అయిన వారి వద్దకు వెళ్లి గుండంలోని బూడిదను పూసి ఆనందం వెలిబుచ్చారు. బత్తలపల్లి ఎస్సీ కాలనీ మహిళలు పానకం దుత్తలతో ఊరేగింపుగా వెళ్లడం ఆకట్టుకుంది. గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి, రాఘవంపల్లి, ఈదుల ముష్టూరు గ్రామాల్లో పెద్దసరిగెత్తు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ సోమశేఖర్ గ్రామపెద్దలకు సూచించారు.

నేడు భేటీ..: బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలిలో సోమవారం ఉదయం 9 గంటలకు వివిధ గ్రామాల పీర్లు భేటీ అవుతాయి. ఈ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి. భేటీని తిలకించేందుకు వేల సంఖ్యలో ప్రజలు తరలివస్తారు. పోలీసులు పెద్ద సంఖ్యలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్‌ను బైపాస్ మీదుగా మళ్లించేందుకు చర్యలు చేపడుతున్నారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఉదయం 10 గంటలలోపు భేటీ ముగించాలని ఆయా గ్రామాల పెద్దలకు పోలీసులు సూచించారు.

క్లుప్తంగా

నేడు డీపీఓలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్పీ వి.రత్న ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు ఆధార్ కార్డును తప్పని సరిగా వెంట తీసుకెళ్లాలి.

కళ్లలో కారం చల్లి గొలుసు అపహరణ


శాంతమ్మను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: మండలంలో చైన్‌స్నాచర్లు చెలరేగిపోయారు. మండలంలోని మొరసలపల్లిలో ఆదివారం పశువుల మేత కోసం పొలానికి వెళ్లిన పాడిరైతు శాంతమ్మ కళ్లలో కారం చల్లి ఆమె మెడలోని 3 తులాల బరువున్న బంగారు గొలుసును లాక్కొని ఉడాయించారు. ఆ సమయంలో ఆమె కేకలు వేసినా చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఫలితం లేకపోయింది. కాసేపటి తర్వాత అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి, వెంటనే 108 అంబులెన్స్ ద్వారా చిలమత్తూరు పీహెచ్‌సీకి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో బాధితురాలితో మాట్లాడి వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు.

పిల్లలతో కలసి తల్లి అదృశ్యం

ధర్మవరం అర్బన్: కుటుంబ కలహాల నేపథ్యంలో తన ఇద్దరు పిల్లలను తీసుకుని తల్లి కనిపించకుండా పోయింది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీలో నివాసముంటున్న రామకృష్ణ, యర్రమ్మ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం చిన్న పాటి కారణంగా దంపతులిద్దరూ గొడవ పడ్డారు. అనంతరం పిల్లలను పిలుచుకుని తల్లి ఇల్లు విడిచి వెళ్లిపోయింది. ఎంత సేపటికీ వారు తిరిగి రాకపోవడంతో ఆందోళనకు లోనైన భర్త వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో అక్క మహాదేవతల విగ్రహాలు


కుంకాలు చెరుగుతున్న బాలికలు

వైభవం.. అక్క దేవతల ఉత్సవం


పోటీలో పరుగెడుతున్న ఎద్దులు

పుట్టపర్తి అర్బన్: మండలంలోని పెడపల్లి సమీపంలో దొడ్డిగుండ్ల గవిలో వెలసిన అక్క మహాదేవతల ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. రెండు రోజులుగా సాగుతున్న ఈ ఉత్సవాలు తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం వైభవంగా నిర్వహించారు. మొదటి రోజు ఎలవ గంపలో అమ్మవారి ఆభరణాలు, పూజా సామగ్రిని తరలిస్తారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రి ఆలయం వద్దే జాగరణ చేశారు. ఆదివారం వేలాది మంది భక్తుల నడుమ బాలికలు, బాలురు విడివిడిగా కుంకాలు చెరిగారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. కాగా, ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ఎడ్ల బండి పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన 32 జతల ఎద్దులు పోటీలో పాల్గొనగా.. నిర్దేశించిన 200 మీటర్ల లక్ష్యాన్ని తక్కువ సమయంలో చేరుకున్న బండిని లాక్కెళ్లిన ఎద్దులను విజేతలుగా నిర్ధారించి యజమానులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని బూచేపల్లి భూషణ ఎద్దులు, రెండో బహుమతిని ఖాజాపురం వెంకటరెడ్డి ఎద్దులు, మూడో బహుమతిని పైపల్లి సాయి ఎద్దులు, నాల్గో బహుమతిని గాజులపల్లి అనిల్ ఎద్దులు దక్కించుకున్నాయి.

హత్యకు ప్రేరేపించిన జల్సాలు

- వీడిన వృద్ధురాలి హత్య కేసు మిస్టరీ
- ఇద్దరి అరెస్ట్


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మడకశిర: మండలంలోని మణూరు గ్రామానికి చెందిన ముత్తక్క (78) హత్య కేసులో మిస్టరీ వీడింది. అదే గ్రామానికి చెందిన వారే వృద్ధురాలిని హత మార్చినట్లుగా నిర్ధారణ కావడంతో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మడకశిర యూజీ పీఎస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను సీఐలు నగేష్‌బాబు, రాజ్‌కుమార్‌తో కలసి డీఎస్పీ నర్సింగప్ప వెల్లడించారు. కొన్నేళ్ల క్రితం వలస వచ్చి మణూరులో స్థిరపడిన బిహార్‌కు చెందిన ఊర్మిళాదేవితో అదే గ్రామానికి చెందిన చౌడప్ప వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. జల్సాలకు అలవాటు పడిన వీరిద్దరూ.. డబ్బు అవసరం కావడంతో వృద్ధురాలు ముత్తక్కను హతమార్చి ఆమె వద్ద ఉన్న నగదు బంగారాన్ని అపహరించేందుకు పథకం రచించారు. ఈ క్రమంలో గత నెల 28న రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న ముత్తక్క ముఖంపై తలదిండు అదిమి పెట్టి, ఇనుపరాడ్‌తో గొంతును తొక్కి పట్టి హతమార్చారు. అనంతరం వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసు, కాళ్ల వెండి పట్టీలు, బీరువాలో ఉన్న రూ.25వేల నగదు అపహరించారు. బంగారు చైను, వెండి పట్టీలను ఊర్మిళాదేవి, రూ.25 వేల నగదును చౌడప్ప పంచుకున్నారు. ఈ క్రమంలో హత్య కేసు నమోదు చేసి పోలీసులు పక్కా ఆధారాలతో ఆదివారం ఊర్మిళాదేవి, చౌడప్పను అరెస్ట్ చేసి, బంగారు గొలుసు, వెండిపట్టీలు, రూ.10వేల నగదు, హత్యకు ఉపయోగించిన తల దిండు, ఇనుపరాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రెడ్లను టార్గెట్ చేస్తే ఊరుకోం

- ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి


సమావేశంలో పాల్గొన్న రెడ్డి సంఘం ప్రతినిధులు

పుట్టపర్తి టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారిని లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నారని, ఈ దాడులను అరికట్టడంలో ప్రభుత్వం, పోలీసులు విఫలమయ్యారని ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. రెడ్లను టార్గెట్ చేస్తే ఇకపై సహించబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం పుట్టపర్తిలోని సాయిఆరామంలో ఏపీ రెడ్డి సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి రాష్ట్రంలోని జిల్లాల కమిటీ సభ్యులు హాజరయ్యారు. రెడ్ల సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని గోపాలరెడ్డి, ఉపాధ్యక్షుడు పట్నం సురేంద్ర రెడ్డి ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను సభ్యులు ఆమోదించారు. అనంతరం నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. రెడ్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం అంతులేని అలసత్వం వహించిందని ధ్వజమెత్తారు. ఏడాది గడిచినా రెడ్డి కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించక పోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఏ శాఖలోనైనా ఉద్యోగుల పేరులో రెడ్డి అని కనపడితే వెంటనే కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారన్నారు. ఇలాంటి చర్యలు మానకపోతే పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుహాసిని రెడ్డి, ఉపాధ్యక్షుడు పట్నం సురేంద్ర రెడ్డి, రాష్ట్ర సలహాదారు సైక్యం రామకృష్ణారెడ్డి, కార్యనిర్వహక అధ్యక్షుడు ధర్మారెడ్డి, న్యాయ విభాగం సలహాదారు భాగ్యలక్ష్మి రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు భరత్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, ఉపాధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, కార్యదర్శి సిద్ధారెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు నితిన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, బాబుల్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కృష్ణారెడ్డి, నాయకులు సుశీలరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రమణారెడ్డి, రాజారెడ్డి, అరుణరెడ్డి, హిమబిందురెడ్డి, బాలకృష్ణారెడ్డి, నాగిరెడ్డి, రమణిరెడ్డి, దేవరాజులరెడ్డి, కృష్ణారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పీఆర్‌సీ, డీఏ బకాయిలు చెల్లించాలి'

ధర్మవరం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్‌సీ, డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంటనే 12వ పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, ఒక వేళ కమిషన్ ఏర్పాటు ఆలస్యమయ్యే పక్షంలో ఉద్యోగులకు 30శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. సెప్టెంబర్ 2004కు ముందు నియామక ప్రక్రియ పూర్తయిన 11వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలన్నారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, హెచ్.రామంజినేయులు, సాయిగణేష్, వెంకటకిషోర్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుడు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బొలెరో వాహనం బోల్తా

శెట్టూరు: మండలంలోని యాటకల్లు ప్రధాన రహదారిలోని మలుపు వద్ద టమాట బాక్సులతో వెళ్తున్న బొలేరో వాహనం ఆదివారం బోల్తా పడింది. శనివారం అర్ధరాత్రి శెట్టూరు నుంచి అనంతపురం టమాట మార్కెట్‌కు వెళ్తున్న బొలెరో వాహనం యాటకల్లు మలుపు వద్దకు రాగానే స్టీరింగ్ విరిగిపోయింది. దీంతో వాహనం రోడ్డు పక్కన బోల్తా పడింది. డ్రైవర్ తిమ్మరాజు సురక్షితంగా బయటపడ్డాడు. సుమారు 150 బాక్సుల టమాటాలు నేలపాలయ్యాయి.

చెట్టు లేకుంటే అక్షరమే లేదు

- ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి


కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

అనంతపురం కల్చరల్: మనిషి మనుగడకు జీవనాధారమైన చెట్టు లేకుంటే సాహిత్యానికి ఊతమైన అక్షరమే లేదని డాక్టర్ వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీతలు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ అన్నారు. ద్విభాషా కవి జూటూరు షరీఫ్ రాసిన 'చెట్టు' వచన శతకాన్ని ఆదివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో వారు ఆవిష్కరించారు. ఉప్పరపాటి వెంకటేశులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ అంకే శ్రీనివాస్ పుస్తక సమీక్ష చేశారు. సీనియర్ కవులు తరిమెల అమరనాథరెడ్డి, డాక్టర్ జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి, మురళీకృష్ణ, కేసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాయుడు, రియాజుద్దీన్, డాక్టర్ తన్నీరు నాగేంద్ర తదితరులు మాట్లాడుతూ.. షరీఫ్ విలక్షణ కవితా లక్షణాలను కొనియాడారు. గౌరవ అతిథిగా విచ్చేసిన రాచపాలెం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ.. చెట్టు వంటి కవితా సంకలనాలు సమాజాన్ని చైతన్య పరుస్తాయని అన్నారు. అంతకు ముందు ప్రజాగాయకుడు దాసరి ఆదినారాయణ ఆలపించిన ఉద్దీపన గీతం ఆకట్టుకుంది. అనంతరం జూటూరు షరీఫ్‌కు సాహితీ సంస్థల నిర్వాహకులు చం.శాస్త్రి, జిరసం ప్రతినిధులు కొత్తపల్లి సురేష్, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, ఒంటెద్దు రామలింగారెడ్డి, జెన్నే ఆనంద్, మహాబోధి కృష్ణమూర్తి, గోరా, సూర్యనారాయణరెడ్డి తదితరులు ఆత్మీయ సన్మానం చేశారు.

గూగూడు క్షేత్రం.. భక్తజన సాగరం



అగ్ని గుండం వద్ద భక్తుల సందడి (ఇన్‌సెట్) కొలువుదీరిన కుళ్లాయిస్వామి పీర్లు

నార్పల: మండలంలోని గూగూడు కుళ్లాయిస్వామి క్షేత్రం భక్తజన సాగరమైంది. మొహర్రం ఉత్సవాల్లో భాగంగా శనివారం పెద్ద సరిగెత్తు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో గూగూడు కిటకిటలాడింది. ఈ సందర్భంగా తెల్లవారుజామున స్వామి వారిని అర్చకులు హుసేనప్ప ప్రత్యేక పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. నాయీ బ్రాహ్మణులు సన్నాయి వాయిద్యాలతో నీరాజనాలర్పించగా.. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తాదులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు పొర్లు దండాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఫకీర్లు భక్తులకు పానకాలు సమర్పించుకున్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.


ఆంజనేయ స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


అగ్ని గుండం వద్ద పానకాలు సమర్పిస్తున్న దృశ్యం


టెంకాయలు కొడుతున్న దృశ్యం


స్వామి సన్నిధిలో నిద్రిస్తున్న భక్తులు


పానకాలు తీసుకెళుతున్న గ్రామస్తులు

వ్యక్తి బలవన్మరణం


మృతుడు విజయశేఖర్ రెడ్డి

రాప్తాడు: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని హమాలీ కాలనీలో నివాసముంటున్న వెన్నపూస విజయశేఖరరెడ్డి (39), మీన దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. విజయశేఖర్ రెడ్డి గిఫ్ట్ అండ్ నావల్టీస్ షాపు నిర్వహిస్తుండగా, మీన టైలరింగ్‌తో కుటుంబానికి చేదోడుగా నిలిచింది. 2015లో చోటు చేసుకున్న ప్రమాదంలో విజయశేఖర్‌రెడ్డి వెన్నెముకతో పాటు తలకూ బలమైన గాయాలయ్యాయి. చికిత్స అనంతరం కోలుకున్నా... నరాల సంబంధిత వ్యాధితో తీవ్ర ఇబ్బంది పడుతున్నాడు. కట్టె సాయం లేనిదే అడుగు కూడా వేయలేని స్థితిలో తీవ్ర మానసిక క్షోభను అనుభవించిన ఆయన 2018, 2019లో రెండు సార్లు విషపూరిత ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆయా సమయాల్లో కుటుంబ సభ్యులు వెంటనే గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ నెల 4న సాయంత్రం తన తల్లిదండ్రులను మాట్లాడి వస్తానంటూ ఇంట్లో తెలిపి ఎలక్ట్రిక్ లగేజ్ ఆటో తీసుకుని బయలుదేరిన ఆయన ఆ తర్వాత ఇంటికి చేరుకోలేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం ఉదయం ప్రసన్నాయపల్లి గ్రామ సచివాలయం సమీపంలో ఆటోలో వెనుక వైపు ఉన్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని వెన్నపూస విజయశేఖరరెడ్డిగా అనుమానిస్తూ సమాచారం ఇవ్వడంతో భార్య మీన అక్కడకు చేరుకుని పరిశీలించి నిర్ధారించారు. మృతుడి ద్ద మద్యం బాటిళ్లు, విషపు గుళికల బాటిళ్లు లభ్యం అయ్యాయి. మీన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్


జూదరులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండలం మదిరేబైలు తండా అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐలు లింగన్న, కృష్ణమూర్తి తెలిపారు. అందిన సమాచారం మేరకు ఆదివారం తనిఖీలు చేపట్టగా పేకాట ఆడుతూ 8 మంది పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ.55,800 నగదు, 5 ద్విచక్రవాహనాలు, 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి


గాయపడిన నూర్‌మహమ్మద్

హిందూపురం: స్థానిక సత్యసాయి నగర్‌లో పాత కక్షల కారణంగా యువకుడు నూర్ మహమ్మద్ కత్తి పోట్లకు గురయ్యాడు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. రాఖీబ్ అలియాస్ టోఫ్రా కత్తితో దాడి చేయడంతో ముఖం, గొంతుపై తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు బెంగళూరుకు తీసుకెళ్లారు. కాగా, గతంలో ఇద్దరూ మంచి స్నేహితులుగా ఉండేవారని, కొంత కాలంగా విభేదాలతో కక్షలు పెంచుకున్నట్లు తెలిసింది. దాడి చేసిన అనంతరం రాఖీబ్ నేరుగా వన్‌టౌన్ పీఎస్‌కు చేరుకుని లొంగిపోయినట్లు సమాచారం.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



హిందూపురం: స్థానిక రైల్వే స్టేషన్‌లోని 1వ ప్లాట్‌ఫారం షెడ్ కింద ఆదివారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి (65) మృతదేహాన్ని గుర్తించారు. వేషధారణను బట్టి మృతుడిని ముస్లింగా భావిస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. తెల్ల షర్టు, నల్ల ప్యాంటు ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు 94412 38182, 94406 27641కు సమాచారం అందించాలని కోరారు.

రైల్లో నుంచి జారి పడి ప్రయాణికుడి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


గుత్తి/పెద్దవడుగూరు: స్థానిక జీఆర్‌పీ పరిధిలోని మిడుతూరు సమీపంలో ఆదివారం రైలు నుంచి జారి పడి ఓ గుర్తు తెలియని ప్రయాణికుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న గుత్తి జీఆర్‌పీ ఎస్‌ఐ నాగప్ప, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు గుత్తి రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ నాగప్ప కోరారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

బేల్దారి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న చాంద్‌బాషా

రాయదుర్గం టౌన్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. రాయదుర్గంలోని భంభంస్వామి లేఅవుట్ సమీపంలో నివాసముంటున్న చాంద్‌బాషా (25) బేల్దారి పనులతో కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. కొంత కాలంగా సరైన పనులు లేకపోవడంతో కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తారాస్థాయికి చేరుకున్నాయి. దీంతో మనస్తాపం చెందిన చాంద్‌బాషా ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమై శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో తన ఇంటికి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపైకి చేరుకుని కూర్చొన్నాడు. కాసేపటి తర్వాత ఆ మార్గంలో వచ్చిన హొస్పేట-యశ్వంత్‌పూర్ రైలు ఢీ కొనడంతో చాంద్‌బాషా ఎగిరి పట్టాలకు అవతల పడ్డాడు. లోకో పైలెట్ సమాచారంతో రైల్వే ఎస్‌ఐ మహేంద్ర, హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తి అక్కడకు చేరుకుని పరిశీలించారు. తలకు తీవ్రమైన గాయంతో అపస్మారక స్థితిలో చేరుకున్న చాంద్‌బాషాను వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా మన్రో వర్ధంతి


మన్రో సమాధి వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గుత్తి: దత్త మండలాల కలెక్టర్ సర్ థామస్ మన్రో 198వ వర్ధంతిని గుత్తి కోట సంరక్షణ సమితి , మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కోట వీధిలో ఉన్న సర్ థామస్ మన్రో సమాధిపై పూలు చల్లి నివాళులర్పించారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, గైడ్ రమేష్ మాట్లాడుతూ.. సర్ థామస్ మన్రో సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా, కళాకారుడు విజయకుమార్, కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, సభ్యులు దస్తగిరి, నిజాం, జిలాన్, నరసింహ పాల్గొన్నారు.